సాక్షి
ఏలూరు

సోమవారం । 8 । ఏప్రిల్ । 2024




పేదలకు దానం.. పుణ్య మార్గం

ధనిక, పేద తారతమ్యం లేకుండా సంతోషంగా రంజాన్ జరుపుకోవాలన్నదే ఇస్లాం ప్రబోధం. రంజాన్ నాడు తప్పనిసరిగా పేదలకు సాయం చేస్తారు. IIలో



రూ.22.59 లక్షలు సీజ్

ఎన్నికల తనిఖీల్లో భాగంగా జంగారెడ్డిగూడెంలో ఆర్టీసీ కార్గో బస్ సర్వీసు నుంచి అధికారులు రూ.22.59 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. IIలో



	ఇఫ్తార్ సోమవారం (సాయంత్రం)	సహరి మంగళవారం (ఉదయం)
ఏలూరు	6.27	4.31
భీమవరం	6.24	4.32

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

టిల్లు స్క్వేర్‌కు విశేష ఆదరణ



మాట్లాడుతున్న హీరో సిద్ధు జొన్నలగడ్డ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): తాను హీరోగా నటించిన టిల్లు స్క్వేర్ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోందని హీరో సిద్ధు జొన్నలగడ్డ సంతృప్తి వ్యక్తం చేశారు. చిత్ర విజయోత్సవంలో భాగంగా సినీ బృందం ఆదివారం నగరంలోని వీ మాక్స్ థియేటర్‌లో ప్రేక్షకులను పలకరించింది. అనంతరం విలేకరుల సమావేశంలో హీరో సిద్ధు మాట్లాడుతూ డీజే టిల్లు చిత్రానికి సీక్వెల్‌గా టిల్లు స్క్వేర్ నిర్మించామన్నారు. మొదటి చిత్రం కంటే ఎక్కువ ఆదరణ లభిస్తుందని సంతోషం వ్యక్తం చేశారు. ఏలూరుతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతుందన్నారు. దర్శకుడు మల్లిక్‌రామ్ మాట్లాడుతూ ముఖ్యంగా యువత ఈ చిత్రానికి బాగా కనెక్ట్ అయ్యారన్నారు. ఇప్పటికే చిత్రం రూ.100 కోట్లు వసూలు చేసిందన్నారు.ఆదిత్య ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్ ఎల్‌వీఆర్, ఆకర్ష్ సినిమాస్ సురనేని ఆకర్ష్, రాంబాబు, థియేటర్ మేనేజర్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

డీజీటీలో నగదు స్వాధీనంపై విచారణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపో పరిధిలో ఆదివారం ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేసి ఆర్టీసీ డిపో గూడ్స్ ట్రాన్స్‌పోర్టు (డీజీటీ) నుంచి నగదు స్వాధీనం చేసుకున్న అంశంపై శాఖాపరమైన విచారణ చేస్తున్నట్టు ఏలూరు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎన్‌వీఆర్ వరప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 6న హైదరాబాద్‌లోని కూకట్‌పల్లికి చెందిన ఎస్‌వీకే రాంబాబు అనే వ్యక్తి జంగారెడ్డిగూడెంకు చెందిన ముగ్గురు వ్యక్తులకు 506 బక్కెట్లు, 70 ఫ్యాన్ బాక్సులు, 30 బైక్ స్పేర్ పార్టులు, ఒక బస్తా మొత్తం కలిపి మూడున్నర టన్నులను పంపారన్నారు. వాటిని ఆదివారం జంగారెడ్డిగూడెంలోని రాజ్‌కో స్టోర్ వద్ద దిగుమతి చేస్తుండగా ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీ చేయగా అందులోని లగేజీతో పాటు మూటలో నగదు ఉన్న విషయాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారన్నారు. ఇప్పటివరకూ కేవలం సరుకు రవాణాకు మాత్రమే డీజీటీ వినియోగం జరుగుతోందని, ఇలా నగదు పంపడం తొలిసారిగా గుర్తించామన్నారు. ఈ అంశం ఎవరు డీజీటీ బుక్ చేసుకున్నారో వారిదిగానే పరిగణిస్తామని, దీనిపై శాఖాపరమైన విచారణ కూడా జరుగుతుందని స్పష్టం చేశారు.

రోప్ స్కిప్పింగ్‌లో ప్రతిభ



తాడేపల్లిగూడెం: భోపాల్‌లోని ఎల్‌ఎన్‌సీటీ విశ్వవిద్యాలయంలో ఇటీవల జరిగిన ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ రోప్ స్కిప్పింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో తాడేపల్లిగూడెం నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో ఫార్మసీ విద్యార్థిని వి.న్యూరోసీ రజత పతకం సాధించింది. ఆమెను ప్రిన్సిపాల్ టి.అశోక్, ఫార్మసీ బోధనా సిబ్బంది ఆమెను అభినందించారు.

పొత్తులు.. కత్తులు

- పోలవరం కూటమిలో కుట్రల పర్వం
- జనసేన అభ్యర్థికి చుక్కలు చూపిస్తున్న టీడీపీ కేడర్
- అభ్యర్థిని మార్చాలంటూ చంద్రబాబు ఎదుట ఆందోళన
- టీడీపీ ఇన్‌చార్జి బొరగం నేతృత్వంలో వరుస ఆందోళనలు
- టీడీపీ, బీజేపీ లేకుండా ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి
- సామాజిక కోణమే అభ్యర్థి మార్పు నినాదానికి ప్రధాన అజెండా
- పోలవరం అసెంబ్లీ స్థానంలో రాజకీయ గందరగోళం



సాక్షి ప్రతినిధి, ఏలూరు : ఏలూరు జిల్లా పోలవరం అసెంబ్లీ టికెట్ ఎవరికి ఇచ్చినా ఓకే.. కలిసికట్టుగా పనిచేసుకుంటాం.. జనసేనకు ఇస్తే మేం సహకరిస్తామని టీడీపీ ఇన్‌చార్జి.. అలాగే టీడీపీకి ఇస్తే సహకరిస్తామని జనసేన నేతలు స్థానికంగా మాట్లాడుకున్నారు. ఆ తరువాత రెండు పార్టీల ముఖ్యులకు చెప్పారు. కట్ చేస్తే.. పోలవరం అసెంబ్లీ సీటును పొత్తుల్లో భాగంగా జనసేనకు కేటాయించారు. మొదటి రెండు మూడు రోజులు వ్యవహారమంతా బాగానే ఉంది. ఆ తరువాత నుంచి అసలు గొడవకు తెర లేచింది. జనసేన అభ్యర్థిని మార్చి టీడీపీకి ఇవ్వాలంటూ ఆ పార్టీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్ వర్గీయులు ఆందోళనలకు శ్రీకారం చుట్టారు. చంద్రబాబు కాన్వాయ్‌ని అడ్డగించి మరీ ఘెరావ్ చేయడంతో వివాదం తారాస్థాయికి చేరింది.

పేరుకే రిజర్వుడు నియోజకర్గం.. పెత్తనమంతా వారిదే..

పోలవరంలో పొత్తు పార్టీల్లోని నేతలు ఒకరిపై మరొకరు కత్తులు దూసుకుంటున్నారు. నిన్నమొన్నటి వరకు ధృతరాష్ట్ర కౌగిలిలో గడిపిన రెండు పార్టీల నేతలు కత్తులు దూసుకునే స్థాయికి చేరడం వెనుక ఇద్దరు అభ్యర్థులను నడుపుతున్న రెండు సామాజిక వర్గాలే ప్రధాన కారణమనే చర్చ నియోజకవర్గంలో బలంగా సాగుతోంది. తెలుగుదేశం పార్టీ పోలవరం ఇన్‌చార్జిగా బొరగం శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జిగా చిర్రి బాలరాజు కొనసాగుతున్నారు. పేరుకే ఇది రిజర్వుడు నియోజకవర్గం. జనసేనలో పవన్‌కళ్యాణ్ సామాజికవర్గం, టీడీపీలో చంద్రబాబు సామాజికవర్గం నేతలదే ఇక్కడ ఆధిపత్యం. రెండు సామాజిక వర్గాల నేతలు ఎవరికి సూచిస్తే ఆయా పార్టీ అభ్యర్థులుగా ఇప్పటివరకు రాజకీయం నడిచింది. 2014లో టీడీపీ నుంచి గెలిచిన మొడియం శ్రీనివాస్ 2019లో టికెట్ కోల్పోయారు. 2019లో బొరగం శ్రీనివాస్‌కు సీటు దక్కగా ఆయన ఓటమి పాలయ్యాడు. అయినా ఇన్‌చార్జిగా కొనసాగుతూ నియోజకవర్గంలో బాబు సామాజికవర్గ నేతల సహకారంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే జనసేన పార్టీలో మొదటి నుంచి కొనసాగుతున్న చిర్రి బాలరాజు 2019 ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆ తర్వాత ఆయన ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. ఈ పరిణామాల క్రమంలో పొత్తులతో ప్రతిపక్ష పార్టీలన్నీ కూటమిగా ఏర్పడటంతో పోలవరంలో చిచ్చు రేగింది. పొత్తులకు ముందు వరకు టీడీపీ సీటు కోసం ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే మొడియం శ్రీనివాస్‌లు ప్రయత్నించారు. జనసేనకే టికెట్ అని ప్రకటించడంతో ఇద్దరూ రెండు రోజుల పాటు హడావుడి చేసి సర్దుకున్నారు.

నిరసనల పర్వం

జనసేన టికెట్ ఖరారుకు ముందు టీడీపీ దెందులూరు ఇన్‌చార్జి చింతమనేని ప్రభాకర్, పోలవరం టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాస్, జనసేన ఇన్‌చార్జి చిర్రి బాలరాజులు జనసేన నేత నాదెండ్ల మనోహర్ వద్దకు వెళ్లారు. జనసేన టికెట్ తమ ఇద్దరిలో ఎవరికి ఇచ్చినా ఓకే అని, ఇబ్బంది లేదని మాట్లాడుకుని వచ్చారు. ఆ తరువాత రెండు రోజులకు జనసేన అభ్యర్థిగా చిర్రి బాలరాజును ప్రకటించారు. భీమవరంలో అప్పటివరకు టీడీపీ నేతగా ఉన్న పులపర్తి రామాంజనేయులుకు జనసేన కండువా కప్పి అభ్యర్థిగా ప్రకటించిన రీతిలో అవకాశం దక్కుతుందేమోనని బొరగం ఆశ పడ్డారు. అయితే జనసేన నేతకు టికెట్ ఇవ్వడంతో బాబు సామాజికవర్గ నేతల వర్గీయులతో కలిసి బొరగం వర్గీయులు నిరసనలకు తెరతీశారు.

ఆ సామాజిక వర్గ నేతల వద్దకు వెళ్లలేం

ప్రతి పనికీ పవన్‌కళ్యాణ్ సామాజికవర్గ నేతల వద్దకు తాము వెళ్లలేమని, అందుకే టికెట్ మార్చి టీడీపీ అభ్యర్థికి ఇవ్వాలంటూ బొరగం వర్గీయులు తెరపైకి కొత్త డిమాండ్ తీసుకొచ్చారు. రెండు రోజుల క్రితం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో బస చేసిన చంద్రబాబునాయుడు క్యాంప్ వద్ద ధర్నాకు దిగి తీవ్రస్థాయిలో నిరసన వ్యక్తం చేయడం పోలవరంలో చర్చనీయాంశంగా మారింది. దీంతో అభ్యర్థి మార్పు ఉంటుందని టీడీపీ బలంగా నమ్ముతుండగా, జనసేన అభ్యర్థి మాత్రం టీడీపీ, బీజేపీ నేతలు ఎవరూ లేకుండానే పది రోజుల నుంచి ప్రచారం చేసుకుంటున్నారు. ఇక ఏలూరు ఎంపీ అభ్యర్థి పుట్టా మహేష్‌యాదవ్ పోలవరం జనసేన అభ్యర్థి చిర్రి బాలరాజు నిర్వహించిన సభలకు హాజరుకావడం మరో చర్చగా మారింది.

జగన్‌తోనే సంక్షేమ పాలన

ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆదివారం ఎస్‌పేట, రాజవరం, పిన్నమరెడ్డిపల్లి, నూగుండపల్లి గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు తిరిగి కొనసాగాలన్నా, అవ్వాతాతలకు ఇంటి వద్దకే పెన్షన్ అందాలన్నా ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేయాలని అభ్యర్థించారు. సీఎం జగన్ వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా, సంక్షేమ పథకాలు కొనసాగాలన్న మరోమారు జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు గ్రామాలకు వచ్చి చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోకుండా, మంచి చేసే జగన్‌ని మనసారా ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్‌ను, నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, గొళ్ళ ఇస్సాకు, జిల్లా ఉపాధ్యక్షురాలు సుజనాకుమారి, నాయకులు ఆయన వెంట ఉన్నారు.

మోసం చేసేందుకే పొత్తులు



వెంకటాపురం గ్రామంలో ఎన్నికల ప్రచారంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

కలిదిండి: మరోసారి ప్రజలను మోసం చేసేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) విమర్శించారు. అధికారం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్ని కుట్రలు పన్నినా కూటమిని ప్రజల నమ్మరన్నారు. మండలంలోని వెంకటాపురం గ్రామంలో గుడ్ మార్నింగ్ కలిదిండి అంటూ నాయకులతో కలిసి ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందించామన్నారు. దీంతో లబ్ధిదారులే వైఎస్సార్ సీపీని గెలిపిస్తారని చెప్పారు. మరింత మంచి జరగాలంటే రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. 2014 ఎన్నికల్లో బీజేపీతో పొత్తుపెట్టుకుని చంద్రబాబు ఏ ఒక్క విభజన హామీ సాధించలేదన్నారు. ప్రజలకు చంద్రబాబు చేసిన మోసం గుర్తుందని వచ్చే ఎన్నికల్లో కూటమి నాయకులకు ఓటుతో బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచ్ సాన మీనా సరస్వతి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చిట్టూరి వెంకటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే వైఎస్సార్‌సీపీ లక్ష్యం

ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ఏలూరు నియోజకవర్గంలో ప్రతి ఇంటా సంక్షేమ పథకాలు అందించామనీ, పేదల అభ్యున్నతే లక్ష్యంగా 58 నెలల కాలంలో భారీఎత్తున సంక్షేమ పథకాల రూపంలో సొమ్ములు ప్రజల ఖాతాల్లోకి నేరుగా జమ చేశామని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఆదివారం ఏలూరులోని 27వ డివిజన్ చొదిమెళ్ల ప్రాంతంలో నాలుగో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరికీ పలకరిస్తూ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో 1.87 లక్షల మంది పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించామని చెప్పారు. ఏలూరు పరిధిలో సుమారు ఐదేళ్ల కాలంలో రూ.447 కోట్ల సొమ్ములు నేరుగా ప్రజల ఖాతాల్లోకే చేరేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కారన్నారు. మధ్యవర్తులు, దళారులు, అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేశామన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఏలూరు నగరాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. రాష్ట్ర భవిష్యత్తు మీపైనే ఆధారపడి ఉందనీ, మరోమారు సీఎం జగన్‌ను ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఏలూరు ప్రాంత అభివృద్ధికి రెండు ఓట్లూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు.



ఏలూరు చొదిమెళ్ల ప్రాంతంలో మహిళలను ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఆళ్ల నాని

ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



ఏలూరు(మెట్రో) : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి పౌరుడు స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్ కోరారు. జిల్లాలో ఎన్నికలు విజయవంతంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా వచ్చేనెల 13న జరిగే ఎన్నికల పోలింగ్‌లో ఓటు హక్కు వినియోగించుకోవలన్నారు. జిల్లాలో 16.25 లక్షల ఓటర్లు ఉన్నారని, వీరంతా ఓటు వేసేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికలకు సంబంధించిన అంశాలపై చర్యల కోసం వాట్సాప్ మెసేజ్/ఫొటోల ద్వారా వాస్తవ సమాచారం ప్రజలు అధికార యంత్రాంగానికి అందించాలని కోరారు. దీనికి వాట్సాప్ నంబర్ 94910 41435 అందుబాటులో ఉంచామన్నారు. ఎన్నికల సమాచారం కోసం 1950 టోల్‌ఫ్రీ ఏర్పాటు చేశామన్నారు.

ప్రకటనలకు అనుమతి తప్పనిసరి

ఎన్నికల ప్రవర్తనా నియమావళికి ఉల్లంఘనలు జరగకుండా ఎన్నికల రాజకీయ ప్రకటనలు ప్రసారం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. టీవీ చానల్స్‌లో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు ముందుగా మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి అభ్యర్థులు తప్పనిసరిగా ఆమోదం పొందాలన్నారు.

ఆర్యవైశ్యులపై చంద్రబాబు వ్యాఖ్యలు తగవు

పాలకొల్లు అర్బన్: రావులపాలెం బహిరంగ సభలో చంద్రబాబు ఆర్యవైశ్యులను కించపరిచే విధంగా మాట్లాడిన తీరు బాధాకరమని, తక్షణం ఆయన బహిరంగంగా ఆర్యవైశ్యులకు క్షమాపణ చెప్పాలని వైఎస్సార్ సీపీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బలభద్రుని బాలరెడ్డియ్య డిమాండ్ చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం పట్టణ కిరాణా వర్తకులు, ఆర్యవైశ్యులు సంయుక్తంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పలువురు మాట్లాడారు. కిరాణా షాపుల్లో ఆర్యవైశ్యులు గంజాయి విక్రయిస్తున్నారంటూ చేసిన వ్యాఖ్యలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని ఏఎంసీ డైరెక్టర్, పట్టణ కిరాణా వర్తక సంఘ గౌరవాధ్యక్షుడు సన్నిశెట్టి లీలాభవన్నారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పాలకొల్లు వంటి పట్టణంలో ఆర్యవైశ్యులు నీతి, నిజాయితీగా వ్యాపారాలు చేసుకుంటూ సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, అలాంటి తమ కులస్తులను ప్రస్తావిస్తూ గంజాయి విక్రయదారులుగా చిత్రీకరించడం 40 ఏళ్ల నుంచి రాజకీయాలు నడుపుతున్న చంద్రబాబుకి తగదని పట్టణ కిరాణా వర్తకుడు పైడి వీరాంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్య సంఘ, కిరాణా వర్తక సంఘ నాయకులు నంబూరి శ్రీగంగా పవన్‌కుమార్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు) పాల్గొన్నారు.

డిజిటల్ చదువు.. భవితకు వెలుగు

- ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్య
- కొత్తగా 498 పాఠశాలల్లో అమలు
- ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లోనూ అందుబాటులో..
- మొత్తంగా 1,216 ఐఎఫ్‌పీల ద్వారా బోధన
- జగన్ ప్రభుత్వంలో విద్యా విప్లవం

జిల్లాలో 498 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యను బోధించేందుకు 2023–24 విద్యాసంవత్సరం ప్రారంభంలో ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. వీటిలో 285 ప్రాథమిక పాఠశాలలు కాగా, 213 యూపీ, హైస్కూళ్లు ఉన్నాయి. 285 ప్రాథమిక పాఠశాలల్లో 394 స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయగా, 213 యూపీ, హైస్కూళ్లలో కలిపి 1,216 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేశారు. ఇవి పనిచేయడానికి అవసరమైన విద్యుత్ సదుపాయాన్ని, 4జీ నెట్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది.

నూజివీడు: ప్రభుత్వ బడుల్లో డిజిటల్ విద్యా కాంతులు వెదజల్లుతున్నాయి. పేదవర్గాల పిల్లల భవితకు బంగారు బాటలు పడుతున్నాయి. చాక్‌పీసులతో బ్లాక్‌బోర్డు, గ్రీన్‌బోర్డులపై పాఠాలు బోధించే స్థాయి నుంచి మారుతున్న సాంకేతిక పరిజ్ఞానికి మార్పు చెంది ఇంటరాక్టివ్ ఫ్లాట్‌ప్యానల్స్‌పై పాఠాలు బోధించే స్థాయికి ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చెందాయి. ఒకప్పుడు ప్రభుత్వ బడులంటే సరైన మౌలిక వసతులే ఉండవనే పరిస్థితి నుంచి ప్రభుత్వ బడులంటేనే ప్రత్యేకంగా మాట్లాడుకునే రోజులు వచ్చాయి. ఇదంతా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తీసుకున్న విప్లవాత్మకమైన చర్యలతోనే సాధ్యమైంది.

అంతర్జాతీయ స్థాయిలో..

ఒకప్పుడు చాక్‌పీసు పడని బ్లాక్‌బోర్డులు, చాలీచాలని బెంచీలతో, సరైన వెలుతురు లేని తరగతి గదులు దర్శనమిచ్చేవి. దీంతో పేద విద్యార్థులు చదువుకుంటున్న ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన కూడా దానికి తగ్గట్టుగానే ఉండేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత విద్యకు అధిక ప్రాధాన్యతనివ్వడంతో ప్రభుత్వ విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటుచేసుకున్నాయి. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని తరగతి గదులు నేడు డిజిటల్ విద్యకు కేంద్రంగా మారాయి. పాఠశాల స్థాయి నుంచే పేద వర్గాల పిల్లలకు అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన విద్యను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోంది.



నూజివీడులో జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్‌లో డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయురాలు

సులభంగా.. సమగ్రంగా..

ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులోకి వస్తున్న స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీల ద్వారా బోధన మరింత సులువుగా, సమగ్రంగా సాగుతోంది. ఏదైనా అంశం గురించి ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో స్క్రీన్‌ను కొద్దిసేపు అలాగే నిలిపి ఉంచి వివరిస్తున్నారు. దృశ్య వీక్షణ వల్ల విద్యార్థులకు త్వరితంగా అర్థమై వారి మెదళ్లపై బలమైన ముద్ర పడుతుంది. అలాగే ఇంటర్నెట్‌ను ఉపయోగించుకొని కంప్యూటర్‌లా వాడుకోవడమే కాకుండా యూట్యూబ్, ఫోన్, ట్యాబ్‌లలోని సమాచారాన్ని సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశం ఉంది. ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీల ద్వారా, యూపీ స్కూళ్లు, హైస్కూళ్లలో ఐఎఫ్‌పీల ద్వారా బోధన చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు టెక్నాలజీ, ఆన్‌లైన్ మాధ్యమాలను అందించటం ద్వారా నైపుణ్యాలు అభివృద్ధికి దోహదపడుతుంది. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి విద్యా ప్రమాణాలకు దీటుగా నిలిచే అవకాశం ఏర్పడుతుంది.

ఐఎఫ్‌పీ ప్రయోజనాలు

ఐఎఫ్‌పీని బ్లాక్ బోర్డులాగా వాడుకోవడమే కాకుండా, ఈ బోర్డుపై విద్యార్థుల కోసం రాసిన నోట్సును సేవ్ చేసుకోవచ్చు. అన్ని సబ్జెక్టుల పాఠాలను వీడియో పాఠాల ద్వారా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధంచవచ్చు. ఇంటర్నెట్ కనెక్షన్ ద్వారా దీనిని కంప్యూటర్‌లా సైతం ఉపయోగిస్తున్నారు. గతంలో బోర్డుపై రాసి తుడిచేయడం వల్ల టీచర్లను అడగాలంటే విద్యార్థులకు ఇబ్బందిగా ఉండేది. ఇప్పుడు మళ్లీ అడిగినా టీచర్లు సులభంగా ఐఎఫ్‌పీ స్క్రీన్‌పై చూపించడానికి వీలవుతుంది.

క్లుప్తంగా

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక

ఏలూరు రూరల్: జాతీయ స్థాయి యూత్ బాస్కెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా నుంచి నలుగురు క్రీడాకారులు ఎంపికయ్యారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణారెడ్డి, కార్యదర్శి గవ్వ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. వీరిలో ఏలూరు కస్తూర్బా బాలికల పాఠశాల విద్యార్థిని ఏ.రుత్విక్‌తో పాటు ఏలూరుకు చెందిన వి.ఈశ్వర్‌తేజ, మార్టేరుకు చెందిన ఎస్.కిషోర్, ఎస్.సందీప్ ఉన్నారని తెలిపారు. గత ఏడాది అల్లంపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటి రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వివరించారు. ఈ నెల 9వ తేదీ నుంచి 15 వరకూ పాండిచ్చేరిలో జరిగే 38వ జాతీయ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

కాల్వలో పడి కూలీ మృతి

భీమడోలు: పూళ్లలోని గోదావరి కాల్వలో కాలు జారిపడి ఆదివారం ఓ వ్యవసాయ కూలీ మృతి చెందాడు. గ్రామానికి చెందిన రంభ ఏసు(48) ప్రాణాలు కోల్పోయాడు. ఏసు ఉదయం పనికి వెళ్లి ఇంటికి వచ్చే క్రమంలో రేవులో స్నానం చేసేందుకు వెళ్లగా ఒక్కసారిగా కాలు జారి పడిపోయాడు. కాల్వలో గల్లంతు కావడంతో కుటుంబ సభ్యులు భీమడోలు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది కాల్వలో దిగి గాలింపు చర్యలు చేపట్టారు. అనంతరం మృతదేహాన్ని గుర్తించి వెలికి తీశారు. భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ

ఏలూరు టౌన్: ఏలూరు సత్రంపాడులోని సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలో చోరీ జరిగింది. అమ్మవారి ఆలయంలో ప్రవేశించిన దొంగ అమ్మవారి బంగారుతాడు తాళిబొట్టును అపహరించాడు. ఆదివారం ఉదయం సుమారు 7.30 గంటల సమయంలో చోరీ చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ చోరీ సంఘటనపై వెంటనే స్పందించిన జిల్లా ఎస్పీ డి.మేరీ ప్రశాంతి దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. డీఎస్పీ ఈ.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఏలూరు త్రీటౌన్ సీఐ వి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌభాగ్యలక్ష్మి అమ్మవారి ఆలయంలోకి పోలీసు డాగ్‌స్క్వాడ్ దొంగను గుర్తించాయని, త్వరలోనే చోరీ చేసిన దొంగను పట్టుకుంటామని త్రీటౌన్ సీఐ తెలిపారు.

నాటు సారా కేంద్రంపై దాడి

ద్వారకాతిరుమల: మండలంలోని రామసింగవరంలో ఒక నాటు సారా తయారీ కేంద్రంపై ఆదివారం పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఒక టీడీపీ నాయకుడితో పాటు, మరో వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి, 90 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. ద్వారకాతిరుమల ఎస్సై జి.సతీష్ తెలిపిన వివరాలు ప్రకారం. రామసింగవరంలోని ఒక తోటలో సారా కాస్తున్నట్లు సమాచారం అందుకున్న ఎస్సై సతీష్ సిబ్బందితో కలసి ఆ కేంద్రంపై ఆకస్మికంగా దాడి చేశారు. ఈ దాడిలో టీడీపీ నాయకుడు గోలి భాస్కరరావును, అలాగే పోతిరెం వెంకటేశ్వరరావును అరెస్టు చేసి, 90 లీటర్ల సారాను, ఒక గ్యాస్ సిలెండర్‌ను, గ్యాస్ పొయ్యిని, స్వాధీనం చేసుకున్నారు.

పేదలకు దానం.. పుణ్య మార్గం

చింతలపూడి: ధనిక, పేద తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరూ సంతోషంగా రంజాన్ పండుగను జరుపుకోవాలన్నదే ఇస్లాం ప్రబోధం. రంజాన్ పండుగ నాడు తప్పనిసరిగా పేదలకు సాయం చేస్తారు. దైవం కోసం, దైవ ప్రసన్నత పొందడానికి ఒక బాధ్యతగా సంపదలో కొంత మొత్తాన్ని పేదలకు అందించడమే ఈ జకాత్ ముఖ్య ఉద్దేశం. రంజాన్ నెలలో ముస్లింలు విధిగా జకాత్(దానం) చెల్లిస్తారు.

దగ్గరి బంధువులకు దానానికి ప్రాధాన్యం

సంపద అంటే బంగారం, వెండి, పాడి పశువులు, నగదు, పంటలు, వ్యాపార సామగ్రి, మొదలైనవి. నిరుపేదలకు, రుణగ్రస్తులకు రుణభారం నుంచి విముక్తి చేయడానికి, ధర్మ ప్రచారానికి ,పేద, ధనిక అంతరాలు రూపు మాపడానికి జకాత్ తోడ్పడుతుందని నమ్ముతారు. జకాత్ అంటే పరిశుద్ధ పరచేదని అర్థం. పేదలకు దానం చేయడాన్ని కూడా జకాత్ అంటారు. ముస్లింలు విధిగా ఐదు ప్రాథమిక విధుల్లో జకాత్ ఒకటి. ఇలా రంజాన్ నెలలో జకాత్ చేయడం దేవునికి కృతజ్ఞతలు తెలపడంలో భాగం అని భావిస్తారు. తొలుత దగ్గరి రక్త సంబంధీకులకు ఇస్తారు. దగ్గరి బంధువులు ఆకలితో అలమటిస్తూ ఉంటే వారికి దానం చేయకుండా ఇతరులకు జకాత్ ఇస్తే అది చెల్లదని ఖురాన్ చెబుతోంది. ఆ తరువాత ఇతర బంధువులు, స్నేహితులు, గ్రామంలోని పేదలకు ఇవ్వాలి. జకాత్‌తో భాగంగా పేదలకు పండగ సరుకులు, కొత్త దుస్తులు, నిత్యవసరాలు పంపిణీ చేస్తారు. కష్టకాలంలో ఆదుకోవడమేకాక ఈ దానాన్ని గుప్తంగా ఉంచుతారు. మధ్యతరగతి వారు సాధారణ జీవితం గడిపే వారు జకాత్ పరిధిలోకి రారు. సాధారణ జీవితానికి మించి ఆదాయ వనరులు ఉన్న వారు తప్పని సరిగా జకాత్ చెల్లించాల్సి ఉంటుంది. తమ వద్ద ఆదనంగా ఉన్న ప్రతి 100 రూపాయలకు 2.50 రూపాయల వంతున లెక్కించి చెల్లించాలి. జకాత్ మొత్తాన్ని రంజాన్ పండగ నమాజ్‌కు ముందు రోజే పేదలకు చెల్లించాలి.

గత 54 ఏళ్లుగా పేదలకు సాయం

రంజాన్ పండుగను పురస్కరించుకుని చింతలపూడిలోని అంజుమన్ మహఫిల్ ఇస్లాం కమిటీ, జమాతే ఇస్లామీ హింద్‌లు సంయుక్తంగా ఏటా పండుగ సరుకులు పంపిణీ చేస్తోంది. గత 54 ఏళ్లుగా ఏటా జమాతే ఇస్లామీ హింద్ సమాజ సేవా కార్యక్రమాల్లో భాగంగా పేదలకు సహాయ సహకారాలు అందిస్తోంది. సంస్థకు విరాళాలు, జకాత్, ఫిత్రాల రూపంలో వచ్చే సొమ్ముతో జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం, కొత్తపల్లి, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, తెలంగాణా రాష్ట్రం సత్తుపల్లి తదితర ప్రాంతాలకు చెందిన వందలాది పేద ముస్లిం కుటుంబాలకు ప్రతి సంవత్సరం కొత్త దుస్తులు, పండుగ సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఐదున్నర దశాబ్దాలుగా క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.


చింతలపూడిలో పేద ముస్లింలకు కొత్త దుస్తులు, నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న దృశ్యం(ఫైల్)

చేతనైన సాయం చేయాలి



పండుగపూట ఏ ఒక్కరు పస్తులు ఉండకూడదు. ఆకలి విలువ తెలియచేసేదే రంజాన్ ఉపవాస దీక్ష. ప్రతి ముస్లిం సోదరుడు చుట్టుపక్కల ఉన్న పేదలకు చేతనైన సాయం చేయాలి. మనతో పాటు సంతోషంగా అందరూ పండుగ జరుపుకునేలా దాన ధర్మాలు చేయాలి.

ఎస్‌కె అజార్‌బాబు – అజాం చారిటీ చైర్మన్

70 రెట్లు అధిక పుణ్యం



పవిత్ర రంజాన్ మాసంలో చేసే దాన ధర్మాలకు 70 రెట్లు అదనంగా పుణ్యం లభిస్తుంది. ప్రతి ముస్లిం విధిగా జకాత్ చెల్లించాలి. 50 గ్రాముల తక్కువ కాకుండా వెండి కానీ లేదా అందుకు సమానమైన ధనాన్ని కాని దానం చేయాలి. ఐదున్నర దశాబ్దాలుగా పేద ముస్లిం కుటుంబాలకు కొత్త దుస్తులు, పండగ సరుకులు అందచేస్తున్నాం.

ఎండీ అక్బర్ అలీ, చింతలపూడి జమాతే ఇస్లామీ హింద్ నాయకుడు

విలువలతో కూడిన విద్యా బోధన



శశి అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ

తాడేపల్లిగూడెం: శశి విద్యాసంస్థల్లో విలువలతో ఉన్న విద్యను అందిస్తున్నామని సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ అన్నారు. ఆదివారం తరగతి నుంచి పదో తరగతి వరకు ఐఐటీ, నీట్ ఫౌండేషన్ కోర్సుపై ఆదివారం పట్టణంలోని సంస్థలో అవగాహన కార్యక్రమం జరిగింది. గోపాలకృష్ణ మాట్లాడుతూ 44 ఏళ్లుగా ప్రత్యేకమైన విద్యాప్రణాళికతో క్రమశిక్షణతో విద్యను అందిస్తున్నామన్నారు. ఈ సంస్థలో చదివిన విద్యార్థులు దేశ, విదేశాలలో ఉన్నత స్థానాలు పొందారన్నారు. వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లల చదువుల పట్ల శ్రద్ధ చూపించాలన్నారు. ఐఐటీ, నీట్ సీట్లు పొంది ఉన్నత కొలువులు పొందుతున్నారన్నారు. శశి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా ప్రాంతిసుధ, డైరెక్టర్ బూరుగుపల్లి రాధారాణి, తణుకు క్యాంపస్ ఇన్‌చార్జి నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్, తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి కె.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

దెందులూరులో కూటమికి గట్టి షాక్

- వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ బీసీ సాధికారిత కమిటీ చైర్మన్ అశోక్‌గౌడ్
- పెదవేగి జీజేపీ మండల అధ్యక్షుడితో పాటు పలువురి చేరిక
- వైఎస్సార్‌సీపీలో చేరిన శంకర్ గౌడ్, భాను ప్రకాశ్


సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన చలమోలు అశోక్‌గౌడ్, జీజేపీ చౌదరి, శంకర్ గౌడ్, పాలడుగు భాను ప్రకాశ్.. చిత్రంలో దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. టీడీపీ బీసీ సాధికారిత కమిటీ రాష్ట్ర చైర్మన్, ఏపీ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలమోలు అశోక్‌గౌడ్ ఆదివారం నెల్లూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి, దెందులూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీడీఆర్‌కె చౌదరి కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. పెదవేగి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి, పెదవేగి మండల సీనియర్ నాయకులు పాలడుగు భానుప్రకాశ్, పెదవేగి కోఆపరేటివ్ సొసైటీ మాజీ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాసరావు, జిల్లా గౌడ సంఘం నేత ఎం.వరప్రసాద్, టీడీపీ కార్యదర్శి సిహెచ్ కిరణ్, బీజేపీ పెదవేగి మండల అధ్యక్షుడు శంకర్ గౌడ్, జిల్లా గౌడ సంఘ యూత్ ప్రెసిడెంట్ ప్రసాద్‌లు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎంపీ అభ్యర్థి సునీల్ కుమార్ యాదవ్‌లు పాల్గొన్నారు.

ఇది ట్రయల్ మాత్రమే: అబ్బయ్య చౌదరి

ఈ సందర్భంగా అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీలో ఆదరణకు లోటు లేదని, సముచిత స్థానాలకు కొదవ లేదని, ఇది ట్రయల్ మాత్రమేనన్నారు. మరింత మంది నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరతారని వివరించారు. ఇటీవలే దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన వందలాది మంది టీడీపీ, బీజేపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయన్నారు. గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలమోలు అశోక్‌గౌడ్ చింతమనేని ప్రభాకర్ దాడులు, దౌర్జన్యాలు, కుల అహంకారం, అవమానాలు భరించలేక టీడీపీని వీడారని, స్వయంగా అశోక్‌గౌడ్ చెప్పిన సంగతి రాష్ట్ర ప్రజలు గుర్తించాలన్నారు. పెదవేగి మండల టీడీపీ, బీజేపీ కీలక నాయకులు, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి సైతం వైఎస్సార్‌సీపీలో చేరడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనాదక్షత, వైఎస్సార్‌సీపీ పటిష్టతకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో దెందులూరు నియోజకవర్గ పరిశీలకులు, టీటీడీ బోర్డు మెంబర్ నెరుసు నాగ సత్యం, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, మండల పార్టీ అధ్యక్షులు జానంపేట బాబు, కామిరెడ్డి నాని, సొసైటీ చైర్మన్ వల్లగోళ్ల భూస్వామి, పార్టీ నాయకులు గుత్తా ప్రసాద్, బాలస్వామి ఉన్నారు. పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. అబ్బయ్య చౌదరి ప్రజాదరణలో దూసుకుపోతూ పటిష్ట ప్రణాళికతో దెందులూరును వైఎస్సార్‌సీపీకి అభేద్యమైన కోటగా మారుస్తున్నారన్నారు.2019 సీన్ రిపీట్ కోసం ఎదురుచూస్తున్నామన్నారు. అబ్బయ్య చౌదరి కొడుతున్న దెబ్బలకు చింతమనేని 'అబ్బా' అంటున్నాడని, ఆయన పక్కా వ్యూహాలతో టీడీపీని మట్టి కరిపిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మరింత ఉత్సాహంగా పని చేయడానికి సంసిద్ధంగా ఉన్నాంటున్నారు.

ఘనంగా విప్పర్రు అమ్మవార్ల జాతర ఉత్సవాలు

పెంటపాడు: పెంటపాడు మండలం పడమరవిప్పర్రు గ్రామ దేవతలైన మహంకాళమ్మ, మహాలక్ష్మమ్మ అమ్మవార్ల జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవార్లను ప్రతిష్ఠించి ప్రత్యేక సేవాకార్యక్రమాలు నిర్వహించారు. ఆదివారం రాత్రి భారీ ఉత్సవసామగ్రితో అమ్మవార్లను ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కార్యక్రమంలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆసాదుల నృత్యాలు, తీన్మార్ డప్పులు, బాణసంచా తదితర ఉత్సవ సామగ్రితో అమ్మవార్లు గద్దెగుడువు సేవాకార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు, ఆడపడుచులతో గ్రామం ఉత్సవ శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామ దేవతలకు ప్రతి ఏటా జాతర్లు, సేవాకార్యక్రమాలు నిర్వహించడం ద్వారా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయన్నారు.


అమ్మవారిని దర్శించుకుంటున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, తదితరులు

ఆ ఆళ్వా బోర్డు ఉపాధ్యక్షుడు వద్దీ రఘురాం, మాజీ ఎమ్మెల్యే, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ పసల కనక సుందరరావు, సర్పంచ్ తెంటు జయలక్ష్మి, కోసూరి వెంకట్రామ, ఎంపీటీసీ యండ నరసింహ, మాజీ సర్పంచ్ పసల గంగారావాధరప్రసన్, దోశల నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు బొంతు వీరయ్య, కొలరెడ్డి అబ్బాయి తదితరులు అమ్మవార్లను దర్శించుకున్నారు.

యువకుడి మృతిపై కేసు నమోదు

పెదవేగి: పెదవేగి మండలం లక్ష్మీపురం పంచాయతీ ఎంఆర్ కాలనీ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పెదవేగి ఎస్‌ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామానికి చెందిన తాడేపల్లి సుదీర్, తోట సురేష్‌లు శనివారం రాత్రి ముందురులోని బంధువుల ఇంటికి వెళ్ళి, రాత్రి తొమ్మిది గంటల సమయంలో తిరిగి వస్తున్నారు. ఎంఆర్‌కాలనీ దాటిన తరువాత జాతీయ ఆయిల్‌పామ్ పరిశోధనా సంచలనాలయం ఎదురుగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో సుదీర్(23) అక్కడికక్కడే మృతిచెందగా, సురేష్‌ను ఏలూరు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉండటంతో విజయవాడలో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

నాటు తుపాకీ స్వాధీనం

ముదినేపల్లి రూరల్: అనుమతి లేకుండా వినియోగిస్తున్న నాటుతుపాకీని ఎస్సై డి.వెంకటకుమార్ స్వాధీనం చేసుకున్న సంఘటనపై వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఎన్నికల సందర్భంగా పెట్రోలింగ్ చేస్తుండగా.. మండలంలోని ఊడిపల్లి సమీపంలో తుమ్మలకు చెందిన వెంకటేషన్ శబరి నాటుతుపాకితో వేటాడేందుకు తిరుగుతుండగా అదుపులోకి తీసుకుని ప్రశ్నించారు. తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రూ.22.59 లక్షలు సీజ్


జంగారెడ్డిగూడెంలో సీజ్ చేసిన నగదు వివరాలు వెల్లడిస్తున్న అధికారులు


ముసునూరు నేలపాటివారికుంట వద్ద వాహన తనిఖీలు

జంగారెడ్డిగూడెం: ఆర్టీసీ కార్గో బస్ సర్వీసు నుంచి అధికారులు రూ.22.59 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు అందిన సమాచారం మేరకు హైదరాబాద్‌ నుంచి జంగారెడ్డిగూడెం ఆర్టీసీ డిపోకు చెందిన కార్గో బస్సులో నగదును సీజ్ చేశారు. డీఎస్పీ ఎం.రవిచంద్ర, సీఐ పి.రాజేష్, ఎస్సై జ్యోతిబస్సు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కె.స్వేదజోత, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ఇన్‌ఛార్జ్ కేవీ రంజు, హెచ్‌సీ కోటేశ్వరరావు, కానిస్టేబుళ్లు అబ్బులు, మంగరాజు, పవన్‌కుమార్ కార్గో బస్సును తనిఖీ చేసి ఈ నగదును స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి వస్తున్న ఆర్టీసీ కార్గో బస్సును చెక్ చేయగా.. రూ. 22,59,500 నగదు గుర్తించి సీజ్ చేశారు. ఈ నగదును ఏలూరు ట్రెజరీలో జమ చేస్తామన్నారు. సీఐ పి.రాజేష్ మాట్లాడుతూ ఎన్నికల రూల్స్ ప్రకారం సబ్‌డివిజన్‌లో చెక్‌పోస్టులు ఏర్పాటు

ఆర్టీసీ కార్గోలో తరలిస్తుండగా స్వాధీనం

చేశామన్నారు. రసీదులుగాని, ఆధారాలు గాని లేకుండా ఉన్న రూ. 22.59 లక్షల సొమ్ములు సీజ్ చేశామన్నారు. ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధరరావు మాట్లాడుతూ ఈ నగదు హైదరాబాద్ కూకట్‌పల్లిలో కేవీఆర్ అనే వ్యక్తి కార్గోలో బుక్ చేసినట్లు చెప్పారు. 507 ప్లాస్టిక్ జాకెటులు, ఇనుప సామగ్రి తదితర వస్తువులు ఐదు టన్నుల వరకు కేవీఆర్ అనే వ్యక్తి ట్రాన్స్‌పోర్ట్ చేసినట్లు చెప్పారు. వీటిని జంగారెడ్డిగూడెంలో రాజ, రాము, ప్రకాష్ అనే వ్యక్తులకు ఎల్ఆర్ బుక్ చేసినట్లు తెలిపారు. ఒక జాకెట్‌లో ప్లాస్టిక్ గోనె సంచిలో నగదును ప్యాక్ చేసి అనుమానం రాకుండా ఉంచి పంపినట్లు తెలిపారు.

వాహన తనిఖీలు ముమ్మరం

ముసునూరు: వాహన తనిఖీలు ముమ్మరం చేసినట్లు ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ ప్రసాద్ గుప్తా తెలిపారు. ఆదివారం ఆయన ఆధ్వర్యంలో స్క్వాడ్ టీమ్ సభ్యులు ముసునూరు నేలపాటివారికుంట, సూరేపల్లి క్రాస్‌రోడ్‌లో సిబ్బందితో కలిసి పలు వాహనాలు తనిఖీ చేశారు. అక్రమ మద్యం, నగదు రవాణాపై విస్తృతంగా తనిఖీలు చేస్తున్నామని, రూ.50 వేలు మించి నగదు ఆధారాలు లేకుండా రవాణా చేస్తే, నగదుతోపాటు వాహనాన్ని కూడా సీజ్ చేస్తామన్నారు.

నగదు స్వాధీనం

చింతలపూడి: చింతలపూడి మండలం లింగగూడెం చెక్‌పోస్ట్ వద్ద ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ సునీల్, సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో రూ. లక్ష స్వాధీనం చేసుకున్నట్లు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి వీవీవీ గోపాలకృష్ణ తెలిపారు.

రేపు చినవెంకన్న క్షేత్రంలో ఉగాది వేడుకలు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్నకు ఉగాది పండుగ తొలి ఉత్సవం. అందుకే ఈ పండుగకు క్షేత్రంలో ప్రత్యేక స్థానం ఉంది. ప్రతి ఏటా శ్రీవారి వైభవాన్ని చాటేలా ఈ ఉత్సవాలను అధికారులు వైభవంగా నిర్వహిస్తారు. అందులో భాగంగా ఈనెల 9న సాయంత్రం 6 గంటలకు ఉభయ దేవేరులతో స్వామివారు ఆలయం నుంచి వెండి శేషవాహనంపై బయటకు రానున్నారు. ఉగాది మండపం వద్దకు చేరుకుంటారు. అనంతరం మండపంలో శ్రీవారు, అమ్మవార్లను వేంచేపు చేసి అర్చకులు, పండితులు పంచాంగ శ్రవణాన్ని జరిపి, రాశి ఫలాలు చదివి వినిపిస్తారు. ఈ తరహా పండిత సత్కారాలు ఘనంగా నిర్వహిస్తారు.



క్షేత్రంలో ముస్తాబవుతున్న ఉగాది మండపం

రైలు ప్రమాదంలో యువకుడి మృతి

భీమడోలు: భీమడోలు సమీపంలోని సూరప్పగూడెం రైల్వే వంతెన వద్ద ఆదివారం రైలు ప్రమాదంలో గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వివరాల ప్రకారం మృతుని ఎత్తు 5.5 అడుగులుండగా.. పిస్తా రంగు పొడుగు చేతుల చొక్కా, సిమెంట్ రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిస్తే 8074055378 నెంబరుకు ఫోన్ చేయాలన్నారు.

హిందువులంతా గర్వించేలా భకాసుర చిత్రం

ఏలూరు (ఆర్ఆర్ పేట): పౌరాణిక కథాంశంతో హిందువులంతా గర్వించేలా భకాసుర చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నామని ఆ చిత్ర దర్శకుడు తమ్మిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. తాన్వి ఆర్ట్స్, కల్పనా క్రియేషన్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్న భకాసుర చిత్రం ఫస్ట్ లుక్, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం రాత్రి స్థానిక పట్టేవారి బృందావనం పార్కులో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే 70 శాతం షూటింగ్ పూర్తి చేశామన్నారు. హీరోగా షేక్ శివన్, హీరోయిన్‌గా పల్లవి నటిస్తున్నారు. నగరానికి చెందిన నటుడు, చిత్రం విలన్ పాత్రధారి అజయ్ అధ్యర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


భకాసుర చిత్రం వాల్ పోస్టర్ ఫస్ట్‌లుక్ విడుదల చేస్తున్న చిత్ర బృందం

వైఎస్సార్‌సీపీకే బీసీల మద్దతు

యలమంచిలి: బీసీల ఆత్మగౌరవం పెంచి వారికి రాజ్యాధికారాన్ని దగ్గర చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీకే రాష్ట్రంలోని బీసీ సంఘాల సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆల్ ఇండియా బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు గుడాల వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని గుంపర్రు గ్రామ పంచాయతీ కడిమిపుంతలో బీసీ నాయకుడు తుంగా నాగేశ్వరరావు కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్ శాతాన్ని పెంచడం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి బీసీ ఆత్మగౌరవాన్ని పెంచారన్నారు. 2019 ఎన్నికలకు ముందు పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీ మేరకు జాతీయ బీసీ కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. ఓసీ కేటగిరీలో కూడా బీసీలకు అవకాశం ఇవ్వడం జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలపై ఉన్న నమ్మకానికి నిదర్శనమన్నారు. రాజకీయ పదవుల్లోనే కాక నామినేషన్ వర్కుల్లో బీసీలకు ప్రాధాన్యం ఇచ్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెట్టడం ద్వారా దేశంలోనే అత్యంత సమర్థనీయమైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని భావిస్తున్నట్టు చెప్పారు.. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని బీసీలంతా అండగా నిలిచి రెండోసారి ముఖ్యమంత్రిని చేస్తారని వెంకటేశ్వరరావు చెప్పారు. బీసీ నాయకుడు తుంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి పాలకొల్లు ఎమ్మెల్యేగా గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)ని, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించి రిటర్న్ గిఫ్ట్ ఇస్తామని చెప్పారు. సమావేశంలో శెట్టిబలిజ సంఘ ఉభయ గోదావరి జిల్లాల ప్రధాన సహాయ కార్యదర్శి కడలి శ్రీప్రసాద్, ఆచంట నియోజకవర్గ బీసీ సంఘాల అధ్యక్షుడు కాండ్రేకుల త్రిమూర్తులు పాల్గొన్నారు.


కడిమిపుంతలో మాట్లాడుతున్న బీసీ ప్రజా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు